# మాజీ యజమాని

శేఖరం పార్కులో అడుగుపెట్టాడు. సంధ్యారుణ రాగం ఆకుపచ్చని, వృక్షాలమీద వింత సొగసు చల్లుతోంది. జనం నడుస్తున్నారు. ఆదివారం.

ఆలోచనలతో పార్కులో తిరగడం మొదలెట్టాడు శేఖరం. ఒక పూలమొక్క చాటున ఎదురుగా వున్న తటాకం చూస్తూ కూర్చున్న వనిత శేఖరం దృష్టికి తారసపడింది. ప్రక్కనే మూడు సంవత్సరాల ఈడు పాప బొమ్మలతో ఆడుకుంటుంది. ఆమె నములుతోంది వేరుశనగపప్పు.

శేఖరం కూడా తటాకం ఎదురుగా వెళ్ళి నిలుచున్నాడు. చెరువులో కొంగ జపం చేస్తోంది. నీటి బాతులు ఈదుతున్నాయి.

ప్రక్కకు తిరిగి ఆమెవైపు చూశాడు శేఖరం...

ఆ వనిత ఆమే...

ఆమె యింకా తదేకంగా తటాకం వైపు చూస్తూనే వుంది—

"నమస్కారం!" దగ్గరకు వెళ్ళి నిలుచున్నాడు. హఠాత్తుగా ఆమె శేఖరం వైపు చూసింది.

నవ్వింది—కూర్చోమని సైగచేసింది.

"ఏమిటి ఇలా వచ్చారు ?" పలుకరించింది ఆమె.

"ఇలా వచ్చాను తోచక!"

"ఎందుకు తోచలేదు ఆమె కొంటె ప్రశ్న"

"మతి చెడి" కోపంగా శేఖరం

మతి పూర్తిగా భ్రమించిందా ? అదే కిలకిల నవ్వు.

శేఖరం ఉద్రిక్తుడయ్యాడు - సర్దుకుని నవ్వాడు చిరునవ్వు.

చూడండి యీ తటాకం తామరాకులు - కొంగలు - చుట్టూ చెట్లూ - చెట్లమీద పక్షులు—చెట్లు రాల్చే ఆకులు - పచ్చగడ్డి నేల - బలే రమ్యంగా వుంది. నిత్యం రోగుల మూల్గుల వాసనలతో భరించే జీవితానికి యిది కొంచెం విశ్రాంతి నిస్తోంది.

"చెప్పండి !" శేఖరం తిరిగి ఆమెవైపు చూశాడు.

ఈ విశ్రాంతి సమయంలో హాయిగా వున్న సమయంలో అనవసరంగా పాచకంలో పుడకలు ఉద్భవిస్తున్నాయి. మళ్ళా నవ్వింది అతనివైపు.

శేఖరం కోపంగా లేచాడు. ఆమె మాటల్లోని వ్యంగ్యం గుర్తించి.

కూర్చోండి - పుండుమీద కారం చల్లినట్లుంది. ఆమె మళ్లీ నవ్వింది.

పాప ఆడుకుంటున్న బొమ్మ విరిగి పోయింది - పాప కేర్ మని ఏడ్పు ప్రారంభించింది.

"కొంచెం ఎత్తుకోండి పాపను - ఆ మాత్రం దయ లేదు !"

శేఖర్ కు ఉడుకుమోతు తనం వచ్చింది.

ఏదో సరదాగా మాట్లాడుదామనుకుని వస్తే, ఆమె ఎందుకు అలా ఏడిపించేలా మాట్లాడుతుంది? ఆమెలో వున్న గర్వం ? జీవితంలో ఆమెముందు తాను ఓడిపోయానన్న ధైర్యం ఆమెను ఆ విధంగా మాట్లాడిస్తుంది-ప్రవర్తింప చేయనిస్తుంది - నెత్తిమీద దాకొన్న దయ్యంలా.

'ఎలావుంది మీయిల్లు ఒక్కసారీ చూపించారు కాదే ?' పాప నెత్తుకొని బుజ్జగిస్తూ అడిగింది.

"రమ్మంటే మీరు వస్తారా"

"రానని మీరు ఎందుకనుకోవాలి?"

"మీ ముఖం చూస్తే తెలుస్తుంది"

"అలాగే- నా ముఖంలో నేను మీ యింటికి రానని వ్రాసి వుందా" మళ్ళీ విరగబడి నవ్వింది ఆమె.

శేఖరం తలవంచుకొని కూర్చున్నాడు.

ఆమె ఆపుకోలేకుండా నవ్వుతోంది.

శేఖర్ మౌనంగా తీవ్రంగా కూర్చున్నాడు.

ఆమె ఒక పుల్ల ఏరి శేఖర్ మీదకు విసిరింది.

అతనిలో చలనం లేదు.

ఒక చిన్న గులకరాయి విసరింది.

అతను మాట్లాడలేదు.

తటాకంలోని నీరు చేతిలోకి తీసుకుని మీద చల్లింది.

శేఖరం కదలలేదు.

విరిగిపోయిన పాప బొమ్మ తెచ్చి అతని తలమీద పెట్టింది.

"శేఖరం!" తల కదిపింది ఆమె.

శేఖరం కన్నీరు గారుస్తున్నాడు. ఆమె విస్తుపోయింది.

"క్షమించండి", ఆమె వచ్చి శేఖరం ప్రక్కన కూర్చుంది.

"మిమ్మల్ని హేళన చెయ్యాలని కాదు. యిదంతా, నా జీవితంలో తీరుబడి, విశ్రాంతి లేక నలిగిపోతూంటే కొంచెం స్వేచ్ఛగా మీ రిచ్చిన స్వేచ్ఛవల్ల మాట్లాడాను-ఇదిగో నవ్వరూ ?"

శేఖరం చంటిపిల్లాడిలా నవ్వాడు...

ఆమెకూడా నవ్వింది.

"ఇంట్లో సిగరెట్టు కాలుస్తుకూర్చున్నాను. మీరు యిచ్చిన యాష్‌ట్రే ఎదురుగా వుంది. అందులో నుసి రాలుస్తున్నాను... పదే పదే మీరే జ్ఞాపకం... ఏమీ తోచక, ఏమీ పని చేయ్యలేక— ఈ పార్కులో కాస్త సేద తీర్చుకుందామని వచ్చా... ఇక్కడకూడా మీరే ప్రత్యక్షం... మనస్సులో భావాలు బలంగా విహారం చేస్తున్నప్పుడు-ఆ భావాలకు అనుగుణంగా అకస్మాత్తుగా వాతావరణంకూడా ఒక్కొక్కసారి ఏర్పడుతుంది అనిపిస్తుంది" శేఖరం తన కథ చెప్పాడు... ఆమె స్పందించింది.

ఆదివారం... అమ్మ, తమ్ముడు ... అంతా సినిమాకు వెళ్ళారు. నిన్న వారు రాసిన ఉత్తరం చదువుకుంటూ కూర్చున్నాను... ఆయన ఎంతో మంచివారు... నాఆరోగ్యం క్షేమం— వచ్చే సంక్రాంతికి నాకేం కావాలి ఎన్నో తెస్తానంటూ వ్రాసారు ఒక్క క్షణం నన్ను తలవనిదే ఆయన వుండ

లేరు. మీరు పెళ్ళికి బహుమతిగా యిచ్చిన నిర్మల్ అజంతా సుందర విగ్రహం ఎదురుగా వుంది— అందులో మీరు స్ఫురించారు. ఆయనకంటె పిచ్చిగా బ్రతుకుతున్న మీరు నాకు దూరంగా వ్యధపడుతూ- సుఖంలేక- జీవితం నాశనం చేసుకుంటున్న మీరు గుర్తుకొచ్చారు నా మనస్సు చలించింది- బాధ పడింది. పాపను తీసుకుని పార్కుకు వచ్చి కూర్చున్నా ఇదే పార్కుకు మీరుకూడా రావాలా ! - అదే విచిత్రం అనిపిస్తుంది. జీవితంలో - బాధలు - సుఖాలు ఎవరివల్ల ఎవరికి ఏ విధంగా ఎందుకు కలుగుతాయి. వీటిలో అంతర్యాభతమైయున్న సంబంధం ఏమిటి ?

ఈ ప్రశ్నకు అర్థం కనిపించదు !

ఆమె వేడి నిట్టూర్పు విడిచింది ?

పాప ఏడ్పు మొదలెట్టింది-

"ఇంటికి పోదాం రా" ఆమె కొంగు లాగుతోంది పాప ?

జనసంచారం కొంచెం తగ్గింది

పార్కులో విద్యుద్దీపాలు బాగా వెలిగాయి.

చలి గాలి రివ్వున వీస్తోంది !

'అరె అంది ఆమె'

'ఏం అన్నాడు శేఖరం'

'పాపకు జ్వరం తగిలినట్లు వుందే !'

శేఖరం పాపను ముట్టుకున్నాడు. శరీరం వెచ్చగా తగిలింది.

'అమ్మా !' గట్టిగా అరచింది పాప. శేఖరం ముట్టుకోవడంతో కోపంవచ్చింది.

ఆమె స్లిప్పర్సు తొడిగి లేచి నిల్చింది.

శేఖరం వెంటనే నడిచాడు.

'మాయింటికి ఎప్పుడు వస్తారు ?' అడిగాడు శేఖరం.

'రాను !'

'పిలవలేదని నిష్ఠూరం వేశారు ?'

'ఊరికినే అన్నా! ... రావడం మీకూ నాకూ కూడా మంచిది కాదు ...'

ఆమెలో నవ్వు లేదు—మాటలు సూటిగా ముందుకు వచ్చాయి

ఎదురుగా రిక్షా కనిపించింది.

ఆమె ఆపింది ... రిక్షాలో ఆమె వెళ్ళిపోయింది.

రిక్షా కనిపించేదాకా చూస్తూ నిలుచున్నాడు శేఖరం.

*　　*　　*　　*

నాలుగు రోజులు గడిచాయి. ఒకరోజు ప్రొద్దున్నే టెలిఫోనులో పిలుపు...

"పాపకు ఒంట్లో బాగులేదు! ఒకసారి చూచివెళ్ళరూ"

శేఖరం నిర్ఘాంత పోయాడు. పాపకు వంట్లో బాగు లేకపోతే తనేం చెయ్యగలడు? ఆమె స్వయంగా డాక్టరు? అంటే తన్నువచ్చి కనిపించమనా? శేఖరం ఆలోచిస్తూనే అన్నాడు...

సాయంత్రం ఆరున్నర గంటలకు ఆమె యింటికి వెళ్ళాడు. శేఖరం రాగానే ఆమె ఆహ్వానించింది లోనికి.

గదిలో తమ్ముడు, తల్లీ అంతా చుట్టుముట్టి కూర్చు న్నారు. శేఖరం రాగానే అందరూ నిష్క్రమించారు. పాపకు జ్వరం కాలిపోతోంది...

"ఈవేళ నూటనాలుగు" అంది ఆమె ముభావంగా.

ఆమె టెలిఫోనులోని పిలుపులో ఏదో అంతరార్థం గోచరించింది. స్త్రీ సహజమైన మానసిక బలహీనత ఆప్తు లైన వ్యక్తి దగ్గర ఉండాలనే భావం కనిపించ వచ్చు... అనుకున్నాడు శేఖరం.

"మీవారికి ఉత్తరం రాయలేక పోయారా రమ్మని" అడిగాడు శేఖరం. తనలోవున్న అసూయ మరచిపోయి

"ఆయనకీ ఒంట్లో బాగులేదట... ఉత్తరం వచ్చింది. పాప గురించి రాస్తే మరీ బాధపడతారు..."

పాప ఒత్తిగిల్లింది.

"అమ్మ... అమ్మ... అదిగో పచ్చగ నీళ్లు తే..." ఏమిటో కలవరిస్తోంది పాప.

"ఏం జ్వరం...?" అడిగాడు శేఖరం.

"ప్రస్తుతం చెప్పలేను" ఎవరినైనా డాక్టరుని పిలిపించనా అనుకుంటున్నాను.

"అదేమిటి? మీకు వైద్యం తెలుసుగా"

"తెలియదని కాదు... నా వాళ్ళకు నేను సరిగా వైద్యం చెయ్యలేను అని నా భయం."

ఆమె విచిత్ర మనస్తత్వం ఏమిటో అనిపించింది.

"నీళ్ళు - తే" పాప అరిచింది కళ్ళు మూసుకుని.

ఆమె పాపకు నీళ్ళు అందించింది.

పాప త్రాగలేదు.

"త్రాగు - ఊ" అంటోంది ఆమె.

కాళ్ళతో తన్నింది పాప ఆమెను.

శేఖరం పాప కాళ్ళు పట్టుకున్నాడు.

నోటికి నీళ్లు అందివ్వమని ఆమెకు సైగచేస్తూ- పాప ఒక నిముషం ఊరుకుంది-

"అమ్మా... దొంగలు..." అరిచింది పాప.

శేఖరం వైపు బిత్తరగా చూసింది...

"పాపా!" శేఖరం పాప శిరంపై చెయ్యి వేశాడు...

"నువ్వు... నువ్వు... నాన్నా... నాన్నా మళ్ళీ గట్టిగా అరిచింది... పాప.

"నేనే... నేనే" దగ్గరగా ఎత్తుకున్నాడు శేఖరం పాపను.

"నువ్వు... నాన్న... నాన్న... కాదు..."

"అవును నాన్ననే..." అన్నాడు శేఖరం అప్రయత్నంగా ఆ పాప భయం తగ్గించాలని.

ఆమె నిశ్చేష్టురాలై శేఖరంవైపు చూసింది.

"నాన్న... నాన్న" అంటూ పాప శేఖరం చేతిలో చేయివేసి కళ్లు మూసుకుంది ఒక క్షణం.

ఆమె - శేఖరం... నిశ్శబ్దంగా ఒక క్షణం అలానే వుండిపోయారు.

"నువ్వు రోజూ వస్తావా" అంది పాప.

"ఆ... నువ్వు రమ్మంటే వస్తా!"

"రా రోజూవచ్చి నా దగ్గరే... వుండు. నాకు భయ మేస్తోంది..." పాప మళ్ళీ కేక పెట్టింది.

"పర్వాలేదు పాప! పడుకో నేనున్నాగా - నీకు భయంలేదు... ఎవరైనా నీ దగ్గరకు వస్తే తన్నేస్తా!"

శేఖరం పాప శరీరం నిమిరాడు...

పాప కళ్ళు మూసుకుంది.

శేఖరం పాపను జో కొట్టాడు.

పడుకున్న పాపకు నిద్రపట్టింది...

శేఖరం సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు....

..................

మర్నాడు శేఖరం యింటివద్ద ఉండలేక సాయంత్రం పాపను చూడాలని ఆమె యింటికి వెళ్ళాడు. ఆమె ఆశ్చర్య పోయింది ఆహ్వానించకుండానే వచ్చినందుకు.

"ఎలా వుంది పాపకు?"

"కొంచెం నయం"

శేఖరం పాపదగ్గర కూర్చున్నాడు...

ప్రక్కన ఆమె వున్నసంగతి మరచిపోయాడు శేఖరం

పాప కబుర్లు చెబుతోంది...తన కలలు-ఆటలు-చదువులు-స్నేహితులు అలసిపోయి పడుకుంది...

నాలుగురోజులు శేఖరం పాపను చూడటానికి వెళ్లాడు.

ఆమె శేఖరాన్ని ఎందుకు వచ్చారని ప్రశ్నించ లేక పోయింది...లోలోపల ఆమెకు ఏదో సంతృప్తి, కాని భయం కూడా.

పాపకు జ్వరం తగ్గిపోయింది.

ఒక సాయంత్రం—పాప పత్యం తీసుకున్న సాయంత్రం శేఖరం రాగానే పాప శేఖరం ఒడిలోకి పరుగెత్తుకు వచ్చింది. శేఖరం పాపతో ఒక రోజు గడిపాడు. ఆమె గది బయట కూర్చొని తల్లితో, స్నేహితులతో గడిపింది.

శేఖరం వెళ్ళిపోవడానికి బయలు దేరాడు.

ఆమె గుమ్మందాకా వచ్చింది.

శేఖరం ఆగాడు...ఏదో చెబుదామని.

"పాపకు జ్వరం తగ్గింది ...."

అంటూ ముభావంగా చూసింది శేఖరం వైపు.

"అవును ! నేనింక రోజూ రావడం భావ్యంకాదు అని ...ధ్వని – అనుకుంటూ" అన్నాడు శేఖరం.

ఆమె తల దించుకుంది.

"అవును వచ్చే అవసరం లేదు"

శేఖరం కళ్ళు చెమర్చాయి.

ఆమె వెనుదిరిగింది ముఖం చూడకుండా.

"అవును నేను పెంచుకున్న ప్రేమ వృక్షం ... దాన్ని అల్లుకున్న మనోహరమైన లతపై నాకున్న మక్కువ ఏపుగా పెరుగుతున్నాయి కాని వాటి ఛాయలజోలికి వెళ్ళే హక్కు మాత్రం నాకులేదు. నౌకరీకి కుదిరిన తోటమాలికున్న చనువు, మాజీ యజమానికి ఎందుకు వుంటుంది!" శేఖరం నిట్టూర్చాడు.

"వుండదు" అంది ఆమె సూటిగా.

శేఖరం నిర్విణ్ణుడైనాడు.

అక్కడినుంచి నిష్క్రమించాడు.

ఆమె వెడుతున్న శేఖరంవైపు ఒక క్షణంచూసి, కొంగుతో కళ్ళు తుడుచుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.